క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సర్పంచుల సమైఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు గురువారం పరిశీలించారు. ఉపాధి కూలీలతో చర్చించి, మస్తర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట మనపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, దోనిపాటి ఓంశంకర్, దోనిపాటి చిన్న ఉన్నారు.

ఓపెన్ ఇంటర్‌లో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ

యానాం: పట్టణ పరిధిలో రాజీవ్‌బీచ్ ప్రాంతంలో ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల విద్యార్థులు ఓపెన్ ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ చాటారని గురువారం సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి, ఇన్‌చార్జి కె శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. మానసిక దివ్యాంగులకు ప్రత్యేక విద్యలో శిక్షణతో పాటు అర్హులైన మైల్డ్ అండ్ మోడరేట్ పిల్లలకు సాధారణ విద్యలో కూడా శిక్షణ ఇచ్చి పది, ఇంటర్ విద్యను కూడా ఓపెన్‌స్కూల్ విద్యలో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. బండి సరయు, సంగడాల రత్నం, పొన్నాడ అబీ ఉత్తీర్ణత సాధించారన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

తాళ్లరేవు: నీలపల్లి, ఇంజరం గ్రామ పంచాయతీలలో సుమారు రూ.1.86 కోట్ల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. నీలపల్లిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.80లక్షలతో నిర్మించిన సీసీ రహదారి, ఎస్ఎస్‌ఏ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన హైస్కూల్ అదనపు తరగతి గదులు, ఇంజరం పంచాయతీలో రూ. 30లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రహదారి, రూ.36 లక్షల ఎస్ఎస్‌ఏ నిధులతో నిర్మించిన హైస్కూల్ అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ రాయుడు సునీత, ఎంపీడీఓ కె.సత్యన్నారాయణ, గ్రామ సర్పంచ్‌లు చిట్టూరి నాగమణి, ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు కోరుకొండ కిరణ్‌కుమారి, దంగేటి సూరిబాబు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలి

అమలాపురం రూరల్: విద్యార్థుల్లో ఉండే సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని, ఆ విధంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం చేయాలని డీఈవో షేక్ సలీం బాషా, యునిసెఫ్ స్టేట్ కన్సల్టెంట్ టీ.సుదర్శన్ పేర్కొన్నారు. రూరల్ మండలం పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మూడు రోజుల అటల్ బూట్ క్యాంప్ ప్రారంభోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హెచ్‌ఎం కేఏఆర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈవో, సుదర్శన్ మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే నిమిత్తం కేంద్ర ప్రభుత్వం అటల్ ల్యాబ్స్‌ను మంజూరు చేసిందన్నారు. తొలుత ఉపాధ్యాయులు, విద్యార్థులు జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గామ్ మృతులకు ఆత్మశాంతి కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. డీవైఈవో జి.సూర్యప్రకాశ్, సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎస్‌వో కె.నారాయణరావు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా సైక్లింగ్‌లో పోలీసులు

యానాం: యానాం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ రిజర్వు బెటాలియన్(ఐఆర్‌బీ) పోలీసులు, సాధారణ పోలీసులకు గురువారం ఫిట్ ఇండియా సైక్లింగ్ కార్యక్రమాన్ని సాయ్ ఇన్‌చార్జి ఎస్ ఉదయ్‌కుమార్ ప్రారంభించారు. టి10 క్రికెట్ టోర్నీని నిర్వహించారు.

అధునాతన సాంకేతికతతో రీ సర్వే

సాక్షి, అమలాపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేను చట్టపరమైన సూత్రాలు, సహజ న్యాయానికి కట్టుబడి అధునాతన సాంకేతికతతో ఎటువంటి వివాదాలకూ తావు లేని రీతిలో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి రెవెన్యూ, సర్వే ఉద్యోగులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, సర్వే సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో రెండో దశ రీసర్వే ప్రక్రియపై ఆమె సమీక్షించారు. సుదీర్ఘ కాలంగా హద్దులు తదితర సమస్యలకు సర్వేలో వేగంగా పరిష్కారం ఉంటుందనే విషయాన్ని రైతులకు తెలియజేయాలని, గ్రామసభల్లో భూ యజమానులు పాల్గొనాలని, పూర్తి అవగాహనతో సర్వేకు హాజరై, అధికారులకు సహకరించాలని కోరారు. రెండో దశ సర్వే జూన్ 21 నాటికి పూర్తి చేయాలన్నారు. గ్రామ, మండల సర్వేయర్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు తమ లాగిన్లకు వచ్చిన డేటాను కచ్చితంగా అధికారులకు సమర్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రాజకుమారి, ఆర్‌డీఓలు పి.శ్రీకర్, డి.అఖిల కె.మాధవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్, తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, గ్రామ, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

సర్వే ఉద్యోగులకు క్విజ్ పోటీలు

భూ పరిపాలన అంశాల్లో అధునాతన చట్టాలు, సాంకేతికతపై రెవెన్యూ, సర్వే సిబ్బందికి అవగాహన కల్పించేందుకు శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు జేసీ నిషాంతి తెలిపారు. ఆర్‌డీఓలు, తహసీల్దార్ల సమన్వయంతో వీటిని నిర్వహించనున్నామన్నారు.

అన్నదాతకు దక్కని మద్దతు

- సర్కారీ ధర 1,725... రైతుకు అందుతున్నది రూ.1,550
- దళారీ వ్యవస్థతో బస్తాకు రూ.150 నష్టపోతున్న వైనం
- యథేచ్ఛగా మిల్లర్ల దోపిడీ

తాళ్లరేవు: ఆరు గాలం కష్టించి పనిచేసిన రైతన్నకు పంట చేతికి వచ్చేసరికి అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో మద్దతు ధర ప్రకటించినప్పటికీ ఆ ధరకు కొనుగోలు చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. 75 కిలోల బస్తా (సాధారణ రకం)రూ.1,725, గ్రేడ్ ఏ రకం రూ.1,740లకు కొంటున్నామని ప్రభుత్వం గొప్పగా చెపుతున్నప్పటికీ కేవలం రూ.1,550 మాత్రమే చేతికి వస్తోందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతు సేవా కేంద్రాల సిబ్బందితో కొనుగోలు చేస్తున్నప్పటికీ చాలా ప్రాంతాలలో దళారుల ద్వారానే ధాన్యాన్ని విక్రయిస్తున్నట్లు తెలియవచ్చింది. కొంతమంది రైస్ మిల్లర్లు, దళారులు ఏకమై ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటున్నారు. అప్పు చేసి పెట్టుబడి పెట్టిన రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కాకుండా దళారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టాలపాలవుతున్నారు. ఒకపక్క ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోవడం, మరోపక్క వరికోత యంత్రాలు, మాసూళ్ల ధరలు కూడా అమాంతం పెరిగిపోవడంతో చివరకు ఏమీ మిగలడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పి.మల్లవరం పంచాయతీలో ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న రైతు

ట్రాన్స్‌పోర్టు అమౌంట్ రైతు అకౌంట్‌లోనే వేయాలి



ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా విక్రయించినా రూ.100కి పైగా నష్టపోతున్నాము. ట్రాన్స్‌పోర్ట్ అమౌంట్ పేరుతో సుమారు 70 రూపాయలు నష్టపోతున్నాము. ఆ డబ్బులను కూడా రైతుల అకౌంట్‌లో వేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పేరుకి ప్రభుత్వం కొంటున్నట్లు చెబుతున్నప్పటికీ అధికారులు షావుకార్ల ద్వారానే రైతుల పేరు మీద విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో పలు చార్జీల పేరుతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

– దదాల బుజ్జిబాబు, రైతు, పోలేకుర్రు

దళారులను నమ్మి మోసపోవద్దు



రైతులు దళారుల మాట నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి రెండు, మూడు రోజుల్లోనే డబ్బు అకౌంట్‌లో వేస్తోంది. ప్రభుత్వం సాధారణ రకం రూ.1,725 ప్రకటించగా, దళారులు రూ.1,550కు కొనుగోలు చేస్తున్నారు. ఈ రకంగా సుమారుగా రూ.వంద నుంచి రూ.150కి పైగా నష్టపోతున్నారు. ఈ రకంగా ఎకరాకు సుమారు రూ.5,000 నుంచి రూ.6,000 వరకు నష్టపోతున్నారు. అధికారులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయడంతోపాటు రైతులకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

– వల్లు రాజబాబు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

24 గంటల్లోనే రైతుల అకౌంట్‌కు డబ్బు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించిన వారికి 24 గంటల వ్యవధిలోనే రైతుల అకౌంట్‌లో డబ్బు వేస్తున్నాము. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. మండలంలో 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాము. టీఏ, డీఈఓ, హెల్పర్‌లతో 21 రైతు సేవాకేంద్రాల ద్వారా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి పీపీసీ సెంటర్‌ల ద్వారానే విక్రయించాలని అవగాహన కల్పించాము. రైతులు తప్పనిసరిగా తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారానే విక్రయించాలి.

– ఎస్.ప్రశాంతి, వ్యవసాయ శాఖ అధికారి, తాళ్లరేవు మండలం

మహిళా కార్యదర్శి వైద్యానికి సాయం

అమలాపురం టౌన్: ప్రమాదానికి గురై ప్రస్తుతం బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అమలాపురం మెట్లకాలనీ వార్డు సచివాలయ కార్యదర్శి టి.కృష్ణ కుమారి వైద్యానికి మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రూ.10 వేలు అందించింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు చేతుల మీదుగా ఆమె కుటుంబీకులకు యూనియన్ ప్రతినిధులు గురువారం అందించారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

ఐ.పోలవరం: ప్రభుత్వం రీ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. అమలాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కొత్త మాధవి అధ్యక్షతన ఐ.పోలవరం మండలం మురమళ్ళ గ్రామంలో రెండవ విడత రీ సర్వే గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని రకాల భూ సమస్యలు ఈ రీ సర్వేలో రెవెన్యూ అధికారులు సరి చేస్తారన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారిని మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా రీ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ, మండల సర్వేయర్ సురేష్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహాలక్ష్మి నాయుడు, గ్రామ రెవెన్యూ అధికారి నరసింహమూర్తి, సర్పంచ్ పాల్గొన్నారు.

వీధుల్లో చెత్తకుప్పలకు నిప్పు

యానాం: యానాం మున్సిపాలిటీ పరిధిలో 60 రోజులుగా పారిశుధ్య పనులు పూర్తిగా స్తంభించడంతో వివిధ వీధుల్లో కొండల్లా పేరుకుపోతున్న చెత్తకు స్థానికులు నిప్పు పెడుతుండటంతో గురువారం పలు ప్రాంతాల్లో అగ్నికీలలు వ్యాపించడంతో స్థానిక అగ్నిమాపకదళ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పవలవలసి వచ్చింది. చెత్త పేరుకుపోతుండటంతో వీధుల్లో కుప్పలు రహదారి పైకి వస్తుండటంతో విధిలేని పరిస్థితుల్లో స్థానికులు నిప్పు పెడుతున్నారు. దీంతో పొగలు వ్యాపిస్తూ పట్టణంలో ప్రజలు ఇబ్బందులు పడతున్నారు. శివాలయం వీధిలో ఉన్న ప్రభుత్వ స్కూల్ వద్ద చెత్తకుప్పకు నిప్పు పెట్టడంతో అగ్నికీలకు వ్యాపించి స్కూల్ గోడలు మసిబారాయి.

డంపింగ్ యార్డుకు స్థలాల పరిశీలన

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ వద్ద స్థానిక ప్రజల ఆందోళన, ప్రదర్శన వరకు డంపింగ్ యార్డు సమస్య వెళ్లిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. గురువారం పుదుచ్చేరి కలెక్టర్ కులుంగొత్తన్ యానాంలో పర్యటించారు. డంపింగ్‌యార్డు కోసం వివిధ ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కనకాలపేట, గోపాల్‌నగర్, కురసాంపేట, రీజెన్సీ కాలేజీ, పందుల్లంక ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు.

జగ్గిరెడ్డితో ఎంపీటీసీల భేటీ



జగ్గిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు

అల్లవరం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని అల్లవరం మండలానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు గురువారం కొత్తపేటలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ సభ్యులు పులుసుగంటి రాజేశ్వరీ, దొమ్మేటి శ్రీశాంతిభవాని, గుబ్బల రంగనాథస్వామి, మాకే కృష్ణమూర్తి, పార్టీ నాయకులు కర్రి శ్రీను, వడ్డి వెంకటేశ్వరరావు, రోహిణీ శ్రీను, కొప్పాడి వెర్రియ్య పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

అమలాపురం టౌన్: ఏటా వేసవిలో ఏర్పాటు చేసే షటిల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంపుతో ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని అమలాపురం రూరల్ సీఐ, క్రీడాకారుడు డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ఇన్‌డోర్ స్టేడియంలో ఏర్పాటైన సమ్మర్ కోచింగ్ క్యాంపును సీఐ గురువారం ప్రారంభించారు. సభకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు అధ్యక్షత వహించారు. సభకు ప్రత్యేక అతిథిగా అమలాపురానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ హాజరయ్యారు. జిల్లా ఒలింపిక్ అధ్యక్షుడు శరత్‌బాబు మాట్లాడుతూ ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపు ద్వారా 100 మందికి పైగా ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణ పొందుతారని



సభలో మాట్లాడుతున్న సీఐ ప్రశాంత్‌కుమార్. చిత్రంలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్

చెప్పారు. 6 నుంచి 16 సంవత్సరాల లోపు బాలబాలికలు ఈ క్యాంపులో శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు రంకిరెడ్డి రంగమణి (సాత్విక్ సాయిరాజ్ తల్లి), సంయుక్త కార్యదర్శి కల్వకొలను బాబు, తిక్కిరెడ్డి సురేష్, కోచ్‌లు పాల్గొన్నారు.

ఆ రూ.1.50 కోట్ల పనులు ఆపండి

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



అమలాపురం టౌన్: మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత దానికి విరుద్ధంగా రూ.1.50 కోట్లతో పనులు చేపట్టడంపై ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అభ్యంతరం చెప్పారు. స్థానిక హైస్కూలు సెంటరులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గడియారం స్తంభం సెంటరు నుంచి అంబాజీపేట వైపు వెళ్లే మెయిన్ రోడ్డును మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగుల వెడల్పుతో నిర్మిస్తామని చూపించారని తెలిపారు. ఆ రోడ్డులో 50 అడుగుల రోడ్డుకు మాత్రమే నూతన డ్రైయిన్ నిర్మించడాన్ని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. ఇలా పలు పనులు మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా ఉన్నాయని, రూ.1.50 కోట్లతో చేపడుతున్న ఈ పనులను తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. ప్రజాధనం వృథా కాకుండా కలెక్టర్ ఈ పనులు నిలిపిసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో దాదాపు పది చెరువులు కబ్జాకు గురయ్యాయని ఎమ్మెల్సీ ఆరోపించారు. చెరువులను కొందరు ఆక్రమించేస్తే..మరి కొన్ని చెరువుల స్థలాలను మున్సిపాలిటీయే ఆక్రమించి భవనాలు నిర్మించిందని గుర్తు చేశారు. గడియారం స్తంభం సెంటరుకు సమీపంలో కంచర చెరువు ఈ తరహాలోనే ఆక్రమణలకు గురైందని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం

కాశ్మీర్ పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడులు చేయడం అమానుష చర్యని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న ఆ పర్యాటక ప్రాంతంపై నిఘా కొరవడిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎంతసేపూ కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్ల విలువైన ఖనిజ, అటవీ సంపదలను దోచిపెట్టేందుకు వెసులబాటు కల్పిస్తుందే తప్ప అలాంటి ప్రాంతంలో పర్యాటకుల రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మ శాంతించాలని ఆయన ప్రార్థించారు.

చాంబర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

అమలాపురం టౌన్: కాశ్మీర్ సమీపంలోని పహల్గామ్ లోయలో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో మృతిచెందిన వారికి కొవ్వొత్తుల ర్యాలీతో ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు గురువారం రాత్రి నివాళి అర్పించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద చాంబర్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో ఈ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ దాడిలో మరణించిన 26 మంది పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని వ్యాపారులు ప్రార్థించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, చాంబర్ కార్యదర్శి కొమ్మూరి వెంకటా చల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, ముఖ్య సలహాదారులు నల్లా పవన్‌కుమార్, కంచిపల్లి అబ్బులు, మోకా వెంకట సుబ్బారావు ర్యాలీలో పాల్గొన్నారు.



అమలాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు

ఉగ్రదాడిపై కొవ్వొత్తుల ర్యాలీ

ముమ్మిడివరం: జమ్మూ కాశ్మీర్ పహల్గాం సమీపంలో ఉగ్రవాదుల దాడిని ముమ్మిడివరం నియోజకవర్గ జనసేన పార్టీనాయకులు తీవ్రంగా ఖండించారు. ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయం నుంచి బల్లగేటు సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో అసువులు బాసిన 28 మంది కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

తాళ్లరేవు: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ తాళ్లరేవులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంనుంచి మార్కెట్ సెంటర్ వరకు ఉగ్రవాదం నశించాలి, ప్రజలకు రక్షణ కల్పించాలి అంటూ నినాదాలు చేస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. అనంతరం ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి నివాళులు అర్పించారు. ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వడ్డి ఏడుకొండలు, వల్లు రాజబాబు, వై.నూకరాజు, జె.ప్రసాద్‌బాబు, కె.ఈశ్వరీబాయి పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత

ఐ.పోలవరం: ఎస్ఎస్‌సీ–2025 పరీక్షా ఫలితాలలో ఐ.పోలవరం మండలంలోని తీర ప్రాంతమైన భైరవపాలెం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 100 శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లిపూడి వీర వెంకటసత్యనారాయణ మూర్తి తెలిపారు. పాఠశాల నుంచి 63 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించి పాఠశాల ఏర్పడిన 16 సంవత్సరాల అనంతరం 100శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలో ఒకటిగా నిలిపారన్నారు. ఈ పాఠశాల నుంచి వరుసగా 569,564,551 మార్కులతో విద్యార్థినులు వరుసగా చెక్కా గౌతమి, శీలం మేరీ, ప్రెసంగి విజయ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారని తెలిపారు.

టెన్త్ టాపర్లకు సత్కారం

తాళ్లరేవు: పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సత్కరించి అభినందించారు. ఇంజరం హైస్కూల్ ప్రాంగణంలో హెచ్‌ఎం కోట శ్రీధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 580 మార్కులతో మండల రెండవ టాపర్‌గా నిలిచిన పెనుగొండ నవ్య ఆశ్రిత, 575 మార్కులు సాధించిన మేడిశెట్టి మంజుల, 572 మార్కులు సాధించిన మానే మనోజ్ఞ లక్ష్మిలను సత్కరించారు. ఎంపీపీ రాయుడు సునీత, గ్రామ సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, పీఎంసీ చైర్మన్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 600 మార్కులకు 597 మార్కులు సాధించి కోనసీమ స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న అమలాపురానికి చెందిన మధు చంద్రికను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అభినందించారు. స్థానిక బుచ్చెమ్మ అగ్రహారంలోని మధు చంద్రిక ఇంటికి గురువారం వెళ్లి విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు కుమార్ రామ్, విజయలక్ష్మిని అభినందించారు.

సైనిక మెహర్‌కు అభినందన

స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని తుమ్మపాల సైనిక మెహర్ టెన్త్ పరీక్షల్లో 600 మార్కులకు గాను 579 మార్కులు సాధించి ఆ పాఠశాలలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. హెచ్‌ఎం వి.విజయకుమారి అభినందించారు.

యానాంపై కక్ష సాధింపు వద్దు

- పుదుచ్చేరి అసెంబ్లీ వద్ద యానాం ప్రజల నిరసన
- చెత్త సమస్య తీర్చకపోతే నిరాహార దీక్ష : సీఎంతో ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో 60 రోజులుగా పారిశుధ్య పనులు పూర్తిగా స్తంభించడంతో ఏ వీధి చూసినా డంపింగ్‌యార్డులా తయారయ్యిందని, తక్షణం డంపింగ్‌యార్డు స్థల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సీఎం రంగసామికి విజ్ఞప్తి చేశారు. గురువారం రెండు బస్సుల్లో జనం యానాం నుంచి పుదుచ్చేరికి 850 కిలోమీటర్లు ప్రయాణించి చెత్త సమస్యను పరిష్కరించాలని కోరుతూ పుదుచ్చేరి అసెంబ్లీ వద్ద ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గంలో ఓటమి చెందాననే భావనతో ఉంటూ యానాం ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని, డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించాలని తాను ప్రాథేయపడుతున్నట్లు సీఎం రంగసామికి ఎమ్మెల్యే అశోక్ వివరించారు. రెండు నెలల నుంచి డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించకుండా ఆర్ఏఓ, ఇన్‌చార్జి మున్సిపల్ కమ ఇషనర్ ఇద్దరూ సెలవులపై వెళ్లారని అటువంటి అధికారులను తక్షణం బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డు సమస్య పరిష్కరించకపోతే పుదుచ్చేరిలో నిరాహార దీక్షకు దిగుతానని స్పష్టం చేశారు. అంతకుముందు హోంమంత్రి నమశ్శివాయంతో చర్చించారు. పుదుచ్చేరి ఎమ్మెల్యే శివశంకరన్, నాయకులు పండు సిద్దార్థ, కాకి నాగేశ్వరరావు, నక్కల సుబ్బన్న, సబ్బతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సీఎం రంగసామికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే అశోక్

పేలవంగా పంచాయతీరాజ్ దినోత్సవ సభలు

డిప్యూటీ సీఎం పవన్ నిర్వహిస్తున్న శాఖ అయినా పట్టని వైనం

అమలాపురం టౌన్: జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం గురువారం అన్ని గ్రామాల్లో నిర్వహించాల్సి ఉన్నా కొన్ని గ్రామాల్లో సభలకు జనం అంతంత మాత్రంగా రావడంతో పేలవంగా జరిగాయి. ఈ సభలకు అధికారులు, సిబ్బంది మినహా ఆ గ్రామ ప్రజలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరు అంతంత మాత్రంగానే ఉంది. కూటమి పార్టీల నాయకులు ఈ సభల్లో అంతగా కనిపించలేదు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో ఈ దినోత్సవ సభల్లో కూటమి నేతలు అటుంచి కనీసం జనసేన నాయకులు, ఆ పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల జాడ కనిపించలేదు. అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం గ్రామ పంచాయతీ వద్ద జరిగిన పంచాయతీరాజ్ దినోత్సవ సభ పేలవంగా జరిగింది. కొద్దిమంది మాత్రమే సభకు హాజరై మమ అనిపించారు. అమలాపురం నియోజకవర్గంలో జరిగిన సభలన్నీ ఇదే తీరులో జరిగాయి. కొన్ని గ్రామాల్లో అయితే దినోత్సవ సభలే జరగలేదు.

అల్లవరంలో...

అల్లవరం: అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరావు అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పంచాయతీలు చాలా కీలకమని తెలిపారు. ఉద్యోగులకు ఎంపీపీ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ కృష్ణమోహన్, ఎంపీటీసీ సభ్యులు మౌనిక, తిక్కా శేషుబాబు, సర్పంచ్ సీహెచ్ శ్రీదేవి, ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, పరిపాలనాధికారి లక్ష్మణరావు, ఏఓ స్వామి, మండల ఇంజనీరింగ్ అధికారి ఫరూక్, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మీ అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు.

గాంధీజీ బాటలో నడవాలి

ఉప్పలగుప్తం: గ్రామ ప్రజలంతా హింసలేని గాంధీజీ బాటలో నడిచి గ్రామీణ వ్యవస్థను సుస్థిరమైన పాలనగా చేసుకోవాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసలవిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సర్పంచ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సిబ్బందికి పాలనపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి డి.శివప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

అభివృద్ధి పనులపై చర్చ

అమలాపురం రూరల్. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కామనగరువు గ్రామ పంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ నక్కా అరుణకుమారి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ముఖ్యఅతిథి ఈవోపీఆర్డీ మంగాదేవి గ్రామంలో జరిగే అభివృద్ధి పనులపై చర్చించారు.

సంక్షిప్తంగా..

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

ముమ్మిడివరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం వేసవి ప్రత్యేక తరగతుల శిబిరాన్ని పాఠశాల హెచ్‌ఎం బి.హనుమంతరావు ప్రారంభించారు. ఎంఈఓ 2 ఆర్ ఉదయభాస్కర్ పాల్గొని ప్రత్యేక శిక్షణ శిబిరానికి రూ.1000, ఫిజిక్స్ ఫారమ్ తరపున భవానీ రూ.1,000, ఉపాధ్యాయిని హిమబిందు రూ.500 విరాళం అందించారు. ఈ సొమ్ము శిబిరంలో విద్యార్థులకు తాగునీరు, స్నాక్స్‌కు ఉపయోగించనున్నారు.

స్టేట్ అథ్లెటిక్ పోటీలకు 80 మంది

యానాం: పుదుచ్చేరిలో గోరిమేడు పోలీస్ గ్రౌండ్‌లో ఈ నెల 26,27 తేదీల్లో జరిగే స్టేట్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు యానాం నుంచి వివిధ ప్రభుత్వ స్కూళ్ల నుంచి 80 మంది క్రీడా బృందం గురువారం పయనమై వెళ్లిందని ఆర్గనైజింగ్ సెక్రటరీ వినకోటి సన్యాసిరావు ప్రకటనలో తెలిపారు. రన్నింగ్, జంప్స్ అండ్ త్రో అంశాల్లో జరిగే పోటీల్లో అండర్–14, 17, 19 బాలురు, బాలికలు పాల్గొంటారన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుదాం

ఉప్పలగుప్తం: పరిసరాల్లో చెత్తను ఎక్కిడికక్కడ ఇష్టానుసారంగా పడవేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుదామని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ సూచించారు. గొల్లవిల్లి పంచాయతీ పరిధిలోని సుమారు 1,100 కుటుంబాలకు గురువారం సర్పంచ్ శ్రీదుర్గ తడి, పొడి చెత్త వేసేందుకు ప్లాస్టిక్ తొట్టెలను అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, పంచాయతీ వార్డు సభ్యులు పరమట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నాడ చిన్ని, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ షెహన్ షా పాల్గొన్నారు.

వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి

అల్లవరం: 1-12-2023 నుంచి 31-10-2024 మధ్య కాలంలో పింఛన్ తీసుకుంటూ ఎవరైనా పురుషులు మృతి చెందినట్లు అయితే వారి భార్యలకు వితంతు పింఛన్ పొందేందుకు గ్రామ సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు జూన్ 1 నుంచి రూ. 4 వేలు పింఛన్ ఇస్తారన్నారు.